ప్రజాశక్తి

ఆదివారం 29 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తాగునీటి కార్మికుల వెతలు పట్టవా ?



విధి నిర్వహణలో తాగునీటి సరఫరా కార్మికుడు

- ధరలు ఆకాశానికి.. వేతనాలు పాతాళంలోకి..
- సమస్యల పరిష్కారానికి రెండు రోజులపాటు సమ్మె
- అధికారుల హామీలతో తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - భీమునిపట్నం, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ విలేకరులు

జివిఎంసిలో తాగునీటి ఒప్పంద కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదు. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా వారి వేతనాలు నేలచూపులే చూస్తున్నాయి. విశాఖ వంటి మహా నగరంలో కుటుంబాన్ని ఆ వేతనాలతో నెట్టుకురావడం కష్టంగా మారింది. ఈ క్రమంలోనే వారు జివిఎంసి పరిధిలోని అన్ని జోన్లలో శుక్ర, శనివారాల్లో సమ్మెకు దిగారు. దీంతో నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. సమస్య తీవ్రమవడం, కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేసిన దరిమిలా అధికార యంత్రాంగం దిగిరాకతప్పలేదు. బుధవారంలోగా తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మళ్లీ పోరాటానికి దిగుతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఇక తాగునీటి కార్మికుల సమస్యల విషయానికొస్తే..

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 56 మంది ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, వీరికి సహాయకులు, టర్న్ కాక్‌లు పని చేస్తున్నారు. వీరంతా కొన్నేళ్లుగా ఒప్పంద కార్మికులుగానే ఉన్నారు. ఇందులో స్కిల్డ్ పనివారిగా ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు ఉన్నారు. వీరికి రూ.18,500 వేతనం ఇస్తున్నారు. మిగతా జోన్లలోనూ ఇదే పరిస్థితి. తమకు రూ 21,500 ఇవ్వాలని వీరంతా డిమాండ్ చేస్తున్నారు. అన్ స్కిల్డ్ పని వారిగా టర్న్ కాక్‌లు, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ల సహాయకులు ఉన్నారు. వీరికి మిగతా 2లో..

కార్మికులతో కమిషనర్, మేయర్ చర్చలు

తాగునీటి కార్మికుల సమ్మె నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు కార్మిక నాయకులతో శనివారం చర్చలు జరిపారు. అవి ఫలించాయి. దీంతో శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు 50 శాతం తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది. సాయంత్రానికి మరికొన్ని చోట్లకు నీటి సరఫరా జరిగింది. వాటర్ సప్లై సిబ్బంది జీతాల పెంపు కోసం కౌన్సిల్ ఇప్పటికే తీర్మానం ఆమోదించిందని, సంబంధిత ఆదేశాల కోసం ప్రతిపాదన ప్రభుత్వం వద్ద సమర్పించబడిందని, అది ప్రభుత్వ స్థాయి పరిశీలనలో ఉందని కమిషనర్ తెలిపారు.



గంటా రాకకోసం డిఇఒ కార్యాలయం వద్ద చేసిన ఏర్పాట్లు

అయినా తీరు మారలేదు !

మళ్లీ ఓ కార్యక్రమానికి గంటా డుమ్మా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన కార్యక్రమాలకు మాజీ మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాకపోవడమో, చాలా ఆలస్యంగా రావడమో చేస్తుండటంతో ఆయనపై నగరంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం సాగర్‌నగర్‌లో ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్మించిన సూపర్ ఇసిబిసి భవన ప్రారంభోత్సవానికి రెండు గంటలపాటు ఆలస్యంగా వచ్చి పలువురికి విసుగు తెప్పించిన గంటా శనివారం ఓ కార్యక్రమానికి పూర్తిగా డుమ్మా కొట్టారు. అసలేం జరిగిందంటే.. దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చినగదిలిలోని డిఇఒ కార్యాలయంలో టీచర్ ట్రైనింగ్ సెంటర్‌కు కుర్చీలు, టేబుళ్లు, ఇతర సామగ్రిని రూ. 22.60 లక్షలతో అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ టీచర్ ట్రైనింగ్ సెంటర్ కార్యక్రమానికి గత మూడు రోజుల్లో రెండుసార్లు దివీస్ యాజమాన్యం ఏర్పాట్లు చేసుకుని ముఖ్యఅతిథిగా భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును ఆహ్వానించింది. ఆయన రెండుసార్లూ ఇతర కారణాలవల్ల కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో శనివారం దివీస్ యాజమాన్యం తీవ్ర అసహనానికి గురైంది. గంటా కార్యక్రమం కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులూ విసుక్కోవడం కనిపించింది.

'ఇగ్నో 'పరీక్షా కేంద్రాల తనిఖీ

▶ వార్త 2లో..

ఉద్యోగులు, అధికారులపై రాజకీయ ఒత్తిడి తగదు

▶ వార్త 6లో..

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

▶ వార్త 5లో..

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా జ్వర పీడితులు పెరుగుతున్నారని, వయసుతో సంబంధం లేకుండా ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో బాధ పడుతున్నారని, జిల్లా అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రులకు జ్వరాలతో ప్రజల తాకిడి పెరిగిందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను కూడా ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతేడాది జిల్లాలో 5 డెంగీ, 259 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటికే డెంగీ 4 కేసులు, మలేరియా 216 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపంతో దోమల పెరుగుదల కారణంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయని, వర్షాలు కారణంగా టైఫాయిడ్ కేసులు కూడా పెరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే వి.మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, రోలుగుంట, నాతవరం, గొలుగొండ మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి వుందని తెలిపారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయితీ అజయ్‌పురం గిరిజన గ్రామంలో 15 మంది గిరిజనులు తీవ్ర జ్వరాలతో మంచాన పడ్డారన్నారు. వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన వైద్య సిబ్బందిని, మందులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం అవసరమైన రక్తపరీక్షల కిట్లు అన్ని పిహెచ్‌సిలు, సబ్ సెంటర్స్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు. జ్వర పీడితులకు రక్తపరీక్షలు నిర్వహించి వ్యాధికి తగ్గట్లుగా వైద్యం అందించాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

పోలవరం పూర్తికాకపోవడానికి జగనే కారణం

మంత్రి పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖకు తాగునీటి సమస్య ఉందని, దీనికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగనే కారణమని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పోలవరం పూర్తయితే విశాఖకు పుష్కలంగా తాగునీరు అందేదన్నారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనలో ఎంత విధ్వంసం జరిగిందో ప్రజలు చూశారని తెలిపారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్, వైసిపి నాయకులు వ్యవహరిస్తున్న తీరు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసునన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ప్రారంభించిన ఇరిగేషన్ ప్రాజెక్టులను జగన్ తన హయాంలో ఆపేశారని ఆరోపించారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా చేశారన్నారు. మూడు రాజధానుల పేరుతో నాటకం ఆడారన్నారు. విశాఖలో విలువైన భూములను కొల్లగొట్టారని, రుషికొండలో విధ్వసం చేశారని అన్నారు. పరిపాలనపై కనీసం పరిజ్ఞానం లేని వ్యక్తి జగనని అన్నారు. పంచాయితీ నిధులను సర్పంచ్‌లకు తెలియకుండా జగన్ వాడుకున్నారన్నారు. అందరి అభిప్రాయం మేరకు రుషికొండ భవనాలపై నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రశ్నకు బదులు చెప్పారు.

సమావేశంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు, అక్కరమాని వెంకటరావు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

తాగునీటి కార్మికుల వెతలు పట్టవా ?

రూ.15 వేలు ఇస్తున్నారు. పిఎఫ్, ఇఎస్ఐపోగా చేతికి రూ.13 వేలా 87 వస్తోంది. రూ.18,500 ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పప్పు, ఉప్పు, బియ్యం, వంట నూనె ఇతర నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయని, ఒప్పంద కార్మికుల వేతనాల్లో మాత్రం పెరుగుదల లేదని, పిల్లల స్కూల్ ఫీజులు, ఆరోగ్యం బాగోలేకుంటే కుటుంబ వైద్యానికి ఖర్చులకే డబ్బులు సరిపోతున్నాయని కార్మికులు అంటున్నారు. 'నేను 24 ఏళ్లుగా టర్న్ కాక్‌గా పని చేస్తున్నాను. ఉదయాన్నే 5 గంటలకు నిర్దేశించిన పాయింట్ల వద్దకు వెళ్తాను. వాల్వ్ ఇప్పి, తాగు నీరు విడుదల చేస్తాను. నెలకు రూ.వెయ్యికి జాయిన్ అయ్యాను. ఇప్పుడు రూ.13 వేలా 87లు వస్తుంది. అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఈ వేతనం ఏ మూలకూ చాలడం లేదు' అని తగరపువలసకు చెందిన ఎన్.చిన గోవింద తన బాధను 'ప్రజాశక్తి' వద్ద వెళ్లగక్కాడు. ఉప్పాడ అప్పల రెడ్డి, పి సంతోష్ మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు.

నీటి సరఫరా కార్మికులకు జేజేలు : సిఐటియు

ఐక్యంగా నీటి సరఫరా కార్మికుల చేసిన పోరాటం మరువలేనిదని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు జేజేలు పలికారు.



మాట్లాడుతున్న చిరంజీవి

గిరిజన మహిళలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురి డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గిరిజన మహిళపై దాడి చేసి అవమానించిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం జగదాంబదరి సిఐటియు కార్యాలయంలో చిరంజీవి అధ్యక్షతన జరిగిన వివిధ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత గిరిజనులపై దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. పోలీసులు చట్టాన్ని వారిచేతుల్లోకి తీసుకుంటున్నారని విమర్శించారు. బాధితులైన దళిత,గిరిజనులు వారికి జరిగిన అన్యాయానికి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని కోరితే, కేసు విత్‌డ్రా చేసుకోవాలని వెనక్కి తిరిగి పంపారని ఆరోపించారు. దొండపర్తి లోని మిరాజ్ సినిమా థియేటర్‌లో పనిచేస్తున్న గిరిజన మహిళలను మేనేజర్ జ్యోతి కులం పేరుతో దూషించడమే కాకుండా బయటకు గెంటివేశారన్నారు. గిరిజన మహిళలు కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో ఫోర్త్‌టౌన్ సిఐ బాధితులను పిలిచి కేసు విత్ డ్రా చేసుకొమ్మని చెప్పారన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జె.వి. ప్రభాకర్ మాట్లాడుతూ పట్టువదలకుండా ధైర్యంగా నిలబడిన గిరిజన మహిళలకు అండగా ఉంటామన్నారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ్‌రావు స్పందిస్తూ దళిత గిరిజన సమస్యల పరిష్కారం కోసం అంబేద్కర్ మిషన్ సొసైటీ తరపున కృషి చేస్తామని చెప్పారు. వర్కింగ్ ఉమెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ మహిళా కార్మికులపై వివక్ష కొనసాగడం దుర్మార్గం అన్నారు. గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ దళిత, గిరిజనులను వేధించడం పోలీసులకు తగదన్నారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న, ఐద్వా జిల్లా కమిటి సభ్యులు కె.సంతోషం, మత్స్యకార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్ రాజు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, నాయకులు గౌరేసు, జిల్లా పౌర గ్రంథాలయాల నాయకులు బి.ఎల్ నారాయణ, ప్రజానాట్యమండలి నాయకులు ఈశ్వరరావు,అవాజ్ నాయకులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాయొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌ను తక్షణం రద్దు చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జోన్ 3 మహాసభ మద్దిలపాలెంలో శనివారం కె.కుమారి అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ పేరిట కార్మిక హక్కులను కాలరాయొద్దన్నారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు యజమానులకు బానిసలుగా మారుతారన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు పాల్గొన్నారు. తొలుత గడచిన మూడేళ్లలో మృతి చెందిన కార్మికులకు నివాళు లర్పించారు. నివేదికను జోన్ కార్యదర్శి నాయుడు ప్రవేశపెట్టారు. అనంతరం 22 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వి.కృష్ణారావు, అధ్యక్షులుగా ఆర్.శ్రీనివాస్, కార్యదర్శిగా జెఆర్.నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.కుమారి, ఉపాధ్యక్షులుగా కొండమ్మ, వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా లలిత, జగదీశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యోగాకు ముందూ.. వెనుకా...!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రజల ఆస్తులు, వనరులు, ఖనిజ సంపదను కార్పొరేట్ల చేతుల్లో పెట్టడమే మోడీ, చంద్రబాబు ప్రభుత్వాల పనిగావుంది. ప్రభుత్వమంటే, ప్రజలకు జవాబుదారీ అన్న కాసింత ఇంగితం కూడా లేకుండా డబుల్ ఇంజిన్ సర్కారు పరుగులు తీస్తోంది. నచ్చినట్లు పాలించడానికి ప్రజలు అధికారమిచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. తామేమిచేసినా భజనచేయాలన్న అహంకారమే ప్రదర్శిస్తున్నాయి. ఆ అధికార దర్పంతోనే చట్ట విరుద్ధమైన పనులకూ వెనుకాడ్డంలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించే మోడీ ప్రభుత్వాన్ని కూటమి నిస్సిగ్గుగా భుజాలపై ఎత్తుకొని మోయబట్టే చంద్రబాబు ప్రభుత్వ వినయ, విధేయతను కాదనలేక అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోడీ విశాఖ విచ్చేశారు. విశాఖలో వీరిద్దరి కలయికకు ముందు, తరువాతా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కార్పొరేట్ సంస్థల వ్యాపారాలకు, కొన్నాళ్లకు అవి వేళ్లూనుకోవడానికి గట్టి ప్రాతిపదిక ఏర్పడిన విషయం గమనించాలి. ఈ క్రమంలోనే కార్పొరేట్ అనుకూల, స్థానిక ప్రజలకు చేటుతెచ్చే నిర్ణయాలు వెలువడుతున్నాయి.

తూర్పు కనుమల్లోని బాక్సైట్ తవ్వకాల అనుమతులకు సంబంధించిన జిఒ 97కు కూటమి ప్రభుత్వం మళ్లీ పదునుపెడుతోంది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ నిల్వలు, వనరులపై ఆధిపత్యానికి ఏ మాత్రం చోటులేని కార్పొరేట్ సంస్థలకు అక్కడ బాక్సైట్‌ను అప్పగించేందుకు జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి), ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి), జాతీయ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో)ను దళారీగా మార్చాలని చూస్తోంది. బాక్సైట్‌ను తమకు కేటాయించాలని వాటితో దరఖాస్తులు చేయించింది. అరకు నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గుర్తేడు వరకు 384 కిలోమీటర్లలో 24 కొండల



మధ్యవున్న వేలకోట్ల విలువైన 612 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను సొంతం చేసుకోవాలని కార్పొరేట్ సంస్థలు గుంట నక్కల్లా చూస్తున్నాయి. బాక్సైట్ తవ్వకాలకు గిరిజనులు సమ్మతించరని తెలిసినా, తమ దగ్గరున్న సాయుధ సైన్యంతో వారిని భయకంపితులనుచేసి అడవి వదిలిపోయేలా చేయొచ్చన్న పొగరు ప్రభుత్వంలో వున్నట్లుంది. బాక్సైట్ తవ్వకాలకు ఎపిఎండిసికి అనుమతులిస్తూ 2015 నవంబరు 5న చంద్రబాబు ప్రభుత్వం జారీచేసిన జిఒ 97 రద్దు వెనుక సిపిఎం, వామపక్షాలు, ఆదివాసీ సంఘాల నడిపిన పోరాటాలు ఈ ప్రభుత్వం మర్చిపోయిందేమోగానీ ఆదివాసీల పక్షానవున్న ఆ పార్టీలు, సంఘాలకు గుర్తున్నాయి.

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)లో నక్కపల్లి మండలంలో భూములు, ఇళ్లు, ఉపాధి కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి నష్ట పరిహారం, పునరావాసం కల్పించని ప్రభుత్వం, ప్రయివేటు ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్‌కు రాయితీలపై రాయితీలు ప్రకటించి ప్రజాధనం దోచిపెడుతోంది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఎస్‌జిఎస్‌టి మినహాయింపు, తక్కువ ధరకు యూనిట్ విద్యుత్ ఇవ్వడానికి ఒప్పుకున్న ప్రభుత్వం, ఇవి చాలవని కేటాయించిన భూమిలో 49 శాతం సబ్ లీజుకు ఇచ్చుకొనే వెసులుబాటు కల్పించింది.

శారదనది పరీవాహక ప్రాంతంలో అదానీకి చెందిన రెండు పంప్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల సామర్థ్యం పెంచుకోవడానికి ఆమోదం తెలిపింది. పెదకోట వద్ద వెయ్యి నుంచి 1800 మెగావాట్లకు, రైవాడ జలాశయంపై 600 నుంచి 900 మెగావాట్ల పవర్ ప్రాజెక్టులకు అదానీకి అనుమతి ఇవ్వడంతో రైవాడ ఆయకట్టు, విశాఖ నగర ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడంలేదు. ప్రజలకు ఇంత అన్యాయం తలపెట్టిన ప్రభుత్వ చర్యలపై కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు మౌనంగా వుండడం విస్మయం గొలుపుతోంది.

ఇపిఎఫ్ పెన్షనర్లకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇపిఎఫ్ పెన్షనర్లకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని, అదేవిధంగా డిఎ కూడా ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎస్.కె హుస్సేన్ కోరారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపిఆర్‌పిఎ నగర కమిటీ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జె.రాంప్రభు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఈ నెల 17న జరిగిన జిల్లా సదస్సు జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధానంగా 'ఆహ్వానం ఫంక్షన్ హాల్' ఉచితంగా ఇవ్వటమే కాక తాగునీరు, టీ సరఫరా చేసిన ఆహ్వానం ఫంక్షన్ హాల్ యజమాని కె.శివకోటేశ్వరరావుకు, వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. 24న స్టేట్ కమిటీ ఆన్‌లైన్ సమావేశ వివరాలను తెలిపారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు ఇపిఎస్ 95 సభ్యులు భారీసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అక్టోబర్‌లో రాజ్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించి మెమోరాండం సమర్పించే కార్యక్రమంలో కూడా సభ్యులు పాల్గొనాలని కోరారు. డిసెంబర్ 22, 23 వ తేదీల్లో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఢిల్లీలో 22న ధర్నా 23న నిర్వహించే సదస్సు జయప్రదం చేయాలని కోరారు. కె.సుధాకర్ మాట్లాడుతూ ఇపిఎస్ 95 పెన్షనర్లకు ప్రధాన కేంద్రంగా విశాఖ జిల్లా ఉందన్నారు. నగర కన్వీనర్ ఎం.వి త్రినాథ్ వందన సమర్పణ చేశారు.

'ఇగ్నో' పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో), విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాలను ఇగ్నో ప్రాంతీయ సీనియర్ సంచాలకులు డా.గోనిపాటి ధర్మారావు శనివారం సందర్శించారు.

మాజీ కార్పొరేటర్ కుమారునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఇళ్ల పట్టాలు ఇస్తానని చెప్పి పలువురు వద్ద రూ.30 లక్షలు వసూలు చేసి, మోసగించిన 36వ వార్డు మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు కుమారుడు కొప్పుల శ్రీరామ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జోన్ నాయకులు యు.ఎస్.ఎన్ రాజు డిమాండ్ చేశారు. శనివారం దక్షిణ నియోజకవర్గం పరిధిలోని రంగిరీజువీధిలో మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు నివాసం ఎదుట సిపిఎం కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొప్పుల శ్రీరామ్ అక్కయ్యపాలెంలో నివసిస్తున్న 10 మంది స్థానికుల వద్ద ఇళ్లపట్టాలు ఇప్పిస్తానని ఆశ చూపించి,రూ. 2 లక్షల 90 వేలనుండి రూ.4 లక్షల 70 వేల వరకు, మొత్తం రూ.30 లక్షలు తీసుకుని ఇళ్లపట్టాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు.

ఎపిఇపిడిసిఎల్ సిజిఎంకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది శనివారం బాధ్యతలు చేపట్టిన ఎల్. మంజునాథ్‌ను ఎపి విద్యుత్ ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కంపెనీ నాయకులు రాష్ట్ర నాయకులు శనివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిజిఎంను కలిసిన వారిలో విజయనగరం సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు, సంఘం నాయకులు కృష్ణనాయక్, బి.నాగేశ్వరరావు , కమిటి సభ్యులు ఉన్నారు.

ఎంజిఎం ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ఎంజిఎం ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. కర్మాగారంలో తీవ్ర గాయానికి గురైన కార్మికుడి బొటనవేలును పూర్తిస్థాయిలో మెరుగుపడే విధంగా చికిత్స నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అంజలి సాఫ్లే, డాక్టర్ సుమిత్ర మాట్లాడుతూకర్మాగారంలో తీవ్రంగా గాయపడి, బొటనవేలు చేతినుంచి పూర్తిగా విడిపోవడానికి దగ్గరగా ఉందని, పేషెంట్ సుభాష్ చంద్రకు మైక్రో సర్జరీ ద్వారా చికిత్స నిర్వహించామన్నారు. ఆయన ఎడమచేతి బొటనవేలుకి అయిన గాయంతో మొదట దానిని తొలగించాలని వైద్యులు చెప్పారు. అయితే స్థానిక డాక్టర్ తాత్కాలికంగా కె-వైర్ ద్వారా స్థిరీకరించి, మైక్రోసర్జరీ కోసం తమ ఆసుపత్రికి రిఫర్ చేశారన్నారు. సర్జరీ విజయవంతంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో డిజిఎం కార్పొరేట్ అశోక్ పట్నాయక్,డిజిఎం ట్రేడ్ వై.రమేష్, ఎంజిఎం ఆపరేషన్స్ ఎ.శైలజా పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పిఎం ఉషా పథకం కింద రూ.4.5 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. వైసిపి పాలనలో కాలేజీ నిర్మాణం ముందుకు కదలనప్పటికీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్పందించి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలన్నారు. కాలేజీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులను పరిశ్రమల సిఎస్ఆర్, దాతల ద్వారా సమకూర్చుతానని హామీ ఇచ్చారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన విద్యా సంస్కరణలను మేధావులు ప్రశంసిస్తున్నారని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యా క్యాలెండర్ ముందుగానే విడుదల చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు యోగా విద్యను పాఠ్యాంశాల్లో భాగంగా చేయాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజీకి అవసరమైన భూమిని కేవలం రెండు నెలల్లో మంజూరు చేయించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు. డిగ్రీ కాలేజీలో 'గంటా నారాయణమ్మ లైబ్రరీ' భవనాన్ని నిర్మించనున్నట్లు స్థానిక నేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, ఎంపిపి మజ్జి శారద, మీసాల సత్యనారాయణ, గాడు వెంకటప్పడు, కోరాడ రమణ, కాళ్ల నాగేష్‌కుమార్, డిఎన్.రాజు, గంటా నూకరాజు, బమ్మిడి ఉమ, మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు గొలుగొండ ఎస్సై పీ.రామారావు తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురంకు చెందిన షేక్ జాన్‌భాషా నర్సీపట్నం అయ్యన్నకాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం నర్సీపట్నం నుంచి కృష్ణదేవిపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పప్పుశెట్టిపాలెం శివారులో వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- గొలుగొండ: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. తమిళనాడు మధురైకు చెందిన ఓ.విఘ్నేష్ గంజాయి కేసులో నిందితుడిగా ఉండి నాలుగేళ్లుగా పరారీలో ఉన్నాడన్నారు. శనివారం ఆ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

30న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 30వ తేదీన స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో, బి.టెక్ చదివిన నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. నైపుణ్యం డాట్ ఎపి డాట్ జిఒవి ఇన్ వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకుని అడ్మిట్ కార్డుతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. అదే రోజు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందని, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9014758949 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విఆర్ఎలను ఆదుకోండి

ప్రజాశక్తి -ఆనందపురం : తరతరాలుగా రెవెన్యూ వ్యవస్థలో గ్రామ నౌకర్లు, గ్రామ సహాయకులు, ప్రస్తుతం విఆర్ఎలుగా సేవలందిస్తున్న దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విఆర్ఎల సంఘం మండల కార్యదర్శి ఉప్పాడ చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ, అనేక మంది విఆర్ఎలు చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తూ, అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. గ్రామ ప్రజలతో పాటు అధికారులతో సమన్వయం ఏర్పరిచి ఎన్నో సేవలందిస్తున్నా, సరైన జీతభత్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నైట్ డ్యూటీలు, అటెండర్ బాధ్యతలు, బాధ్యతతో కూడిన పనులు చేయించుకుంటూ తగిన ప్రతిఫలం ఇవ్వడం లేదన్నారు. పనిభారం ఎక్కువ, జీతం తక్కువగా ఉందని, పెరిగిన ధరల నేపథ్యంలో కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. పిల్లల చదువులకోసం తల్లిదండ్రులు తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నారని చెప్పారు. విఆర్ఎలుగా నిరంతరం పనిచేసినప్పటికీ చనిపోయిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని అన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు కూడా చెల్లించకపోవడం వల్ల చనిపోయిన కుటుంబాలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే విఆర్ఎల జీతాల పెంపు, పేస్కేలు అమలు చేయడంతో పాటు టిఎ, డిఎ తదితరాలను కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వసతిగృహానికి ప్రహరీ లేక అవస్థలు


ప్రహరీ లేని వసతిగృహం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ సమీపంలో ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతిగృహం చుట్టూ ప్రహరీ లేక నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహం చుట్టూ పందులు, కుక్కలు, పశువులు విపరీతంగా సంచరిస్తున్నాయి. ఒక్కోసారి లోపలికి పందులు సైతం రావడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ సమస్య వల్ల రోజంతా ప్రధాన ద్వారం తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొందరు ఆకతాయిలు రాళ్లు రువ్వడంతో కిటికి అద్దాలు దెబ్బతింటున్నాయి. చుట్టూ ఉన్న కాలనీవాసులు వసతిగృహ స్థలంలో వ్యర్థాలు వేయడం, బహిర్భూమి కార్యక్రమాలు తీర్చుకోవడం చేస్తుండటంతో పరిసరాలు అపరిశు భ్రమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఆక్రమణలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. ఇక్కడ కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు స్థానికుల నుంచి రెవెన్యూ, జివిఎంసి అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనికి స్పందించిన కలెక్టర్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశాలతో రూరల్ మండల తహశీల్దార్‌ను ఆదేశించారు. తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ హరితేజ, విఆర్ఓ సత్యందొర, జోన్-2 ఎసిపి తిరుపతిరావు, టిపిఒ, పలు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, విఆర్ఒలు, ఆరిలోవ పోలీసుల బందోబస్తుతో శనివారం ఆక్రమణల స్థలాలను పరిశీలించారు. ఆక్రమణ స్థలాల్లో నిర్మించిన రేకుల షెడ్లను జెసిబిలతో నేలమట్టం చేశారు. నాలుగు షెడ్లు, రెండు పునాదులుతో పాటు ఓ ఖాళీ స్థలాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఖాళీ స్థలంలో ఉన్న బోర్‌ను జివిఎంసి స్వాధీనంకొని మూసేశారు. ఆక్రమణలు తొలగించిన స్థలాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు.



కెరీర్ గైడెన్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-యంత్రాంగం

తగరపువలస : భీమిలి మండలం, లక్ష్మీపురం జెడ్‌పి హైస్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై మోటివేటర్ జరజాపు సురేష్ కుమార్ శని వారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణితంలో మెళకువలు, ఒత్తిడిని ఎలా అధిగమించ వచ్చునేది వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, డి.సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ ఎం.శంకరరావు, కళా సాహితీ సంస్థ సభ్యులు ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్ తరగతులు శనివారం నిర్వహించారు. హైదరాబాద్ నుండి వచ్చిన జరజాపు సురేష్ కుమార్ టైం మేనేజ్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్ టిప్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు, ఉపాధ్యాయులు త్రివేణి, కిరణ్‌కుమార్, కృష్ణారావు, సోమరాజు, సోషల్ వర్కర్ సంకురుభుక్త జోగారావు పాల్గొన్నారు.

పారిశుధ్యం పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని తునివలస గ్రామంలో పారిశుధ్య పనుల తనిఖీ, తాగునీటి ట్యాంక్‌ల క్లోరినేషన్ పనులను ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ షెడ్ నిర్వహణను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి


ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రమజీవుల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను కాలనీవాసులు కలిసి సమస్యలను వివరించారు. కాలనీలో కమ్యూనిటీ హాల్, యోగా కేంద్రం, శ్మశానవాటిక, రహదారి వంటి మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కాలనీలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయని, జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు అందుబాటులో లేక విద్య, ఆరోగ్యం, నిత్యజీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. రోడ్డు సదుపాయం లేక వర్షాకాలంలో రాకపోకలు కష్టంగా ఉందని, చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కంచుబోయిన శ్రీను, పైడిరాజు, గంగులు అప్పల రాము తదితరులు ఉన్నారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారి ఆధ్వర్యాన భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ శాంబాబు, ఇంజినీరింగ్ సిబ్బంది, 89, 90 వార్డుల కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, పలు వార్డుల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. బదిలీపై వెళ్లిన మొత్తం 17 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు కె.రామకష్ణ పట్నాయక్ సహా ఉపాధ్యాయులు రవిప్రసాద్, సత్యనారాయణ, రజియా, బంగారమ్మ, శ్రీనివాస్, అజీమ్, విజయలక్ష్మి, నిర్మల తదితరులకు సాలువా కప్పి, మెమోంటోలు అందజేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బంటుబిల్లి లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొట్యాడ రెడ్డిబాబు పాల్గొన్నారు.


బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రభుత్వ భూములను రాందేవ్ బాబాకు కేటాయించొద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ భూములను రాందేవ్ బాబాకు కేటాయిస్తే అంగీకరించే ప్రసక్తి లేదని, ఈ భూ కేటాయింపుల ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవన్‌లో జాజి ఓంకార్ అధ్యక్షతన శనివారం జరిగిన విదసం కార్యవర్గ సమావేశంలో వెంకటరావు మాట్లాడుతూ, భీమిలి మండలంలో గతంలో శారదా పీఠానికి ఇచ్చి రద్దు చేసిన విలువైన భూముల కోసం రాందేవ్ బాబా ప్రయత్నిస్తున్నారని, ఈ భూములను అట్టడుగు వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం విదసం పోరాడి కాపాడిందని తెలిపారు. జగన్ ప్రభుత్వం శారదా పీఠానికి కేటాయించడం చట్ట విరుద్ధం అని మాతో ఏకీభవించి ఆ కేటాయింపులు రద్దు చేసిన ప్రభుత్వం యోగా ముసుగులో రాందేవ్ బాబాకు దారాదత్తం చేయాలని కూటమి పావులు కదపడం నైతికత కాదని విమర్శించారు. భాగస్వామ్య పార్టీ ఒత్తిడి మేరకు చంద్రబాబు ఇలాంటి బాబాలకు భూ కేటాయింపులు చేస్తే జగన్‌కు మీకు తేడా ఏముందని ప్రశ్నించారు. రాందేవ్ బాబా కార్యకలాపాల్లో నిజాయతీ, నైతికత లేదని సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టిన సంగతి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని భూ కేటాయింపులు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సభాధ్యక్షులు ఓంకార్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యకు డిమాండు చేస్తూ జులై 3వ తేదీన విదసం మహా ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్రె అప్పారావు, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు, కస్తూరి వెంకటరావు, డి.నిర్మల, రవి శేఖర్, బంటు కృష్ణారావు, వడ్ల మురి ఫ్రాన్సిస్, బండి హేనా, తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ ప్రారంభంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు

లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : శ్రీసాయి సుదీప్, కుమారి నిరోషా హీరో హీరోయిన్లుగా పైడి ఫిల్మ్స్ నిర్మాణంలో పైడి మణిశంకర్ నిర్మాతగా 'మనసు' లఘు చిత్రం షూటింగ్ శనివారం పెందుర్తి సమీపంలోని పినగాడి గ్రామంలో ప్రారంభమైంది. రైటర్స్ ఆకాడమి చైర్మన్ రమణమూర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పైడి శంకరరావు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రానికి కథ పైడి శంకరరావు, మాటలు విశ్వనాథ గణపతిరావు, స్క్రీన్ ప్లే కో డైరెక్టర్ బత్తిన సూర్యనారాయణ, ప్రముఖ దర్శకులు రేడ్డం యాదకుమార్ దర్శకత్వ పర్యవేక్షణ, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ ఉదయ్ కుమార్, కెమెరా డేగల శ్రీహరి, ధనుష్, దుర్గ, పుష్యమి వ్యవరిస్తున్నారు. పైడి శంకరరావు, నటరత్న హూష్ కాకి అప్పారావు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కమెడియన్ కోరుకొండ రంగారావు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వేముల భాస్కరాచారి, సీనియర్ జర్నలిస్ట్ నూనెల పైడిరాజు, పని స్వామి, ఎంటి రాజు తదితరులు ఈ చిత్రంలో నటీనటులుగా నటిస్తున్నారు.



పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్లో పేద విద్యార్థులకు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. తండ్రి లేని పేద విద్యార్థులకు అభయం వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో ఆసరా పథకం ద్వారా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థులు కోసం పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు అభయం వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థకు సహాయం కోరగా ఆ సంస్థ స్పందించి కోశాధికారి ఎ.హనుమంతరావు ద్వారా సుమారు 15మంది విద్యార్థులకు అచ్చు, నోటు పుస్తకాలను పూర్తి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, చదువులో బాగా రాణిస్తున్న పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వడంతో పాటు, తండ్రి కోల్పోయిన వారికి అభయం లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ద్వారా ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేసి ప్రోత్సాహిస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అభయం వెల్ఫేర్ సొసైటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గణేష్, కల్యాణ్, శ్రీరామ్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ తయారీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 20వేల సీడ్ బాల్స్ తయారుచేశారు. ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే పెతకం శెట్టి గణబాబు పాఠశాలకు వచ్చి విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థులు తయారుచేసిన ఈ సీడ్ బాల్స్ కొండ ప్రాంతాల్లో, నది ఒడ్డున, మైదాన ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో వేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సీడ్ బాల్స్ తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విదేశాలలో పూర్వ విద్యార్థుల సంఘాలు

ఎయు ఉపకులపతి జిపి.రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : విదేశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ చెప్పారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్ లోని ఏయు కన్వెన్షన్ సెంటర్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్), ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఎగ్జిట్ ఎంగేజ్‌మెంట్ ఈవినింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎయుతో విదేశీ విద్యార్థుల ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చిందని చెప్పారు. సంయుక్తంగా కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడానికి ఇది మార్గం చూపిందని చెప్పారు. విదేశీ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఐసిసిఆర్ అందిస్తున్న సహకారంతో ఇది సాకారం అయిందని తెలిపారు. విదేశీ విద్యార్థులంతా భారత్‌లో అంతర్భాగంగా మారిపోయారని చెప్పారు. ఎయు పూర్వ విద్యార్థులుగా మీరంతా విదేశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచేలా పనిచేయాలని సూచించారు.

ఐసిసిఆర్ స్కాలర్‌షిప్ విభాగం డైరెక్టర్ సంజీవ్ వేది మాట్లాడుతూ, ఎయులో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని తిరిగి వెళుతున్న విదేశీ విద్యార్థులు తమతో పాటు భారతీయతను తీసుకు వెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం విభిన్న దేశాలతో భారత్‌కు ఉన్న స్నేహానికి మరింత విలువను జోడిస్తుందని చెప్పారు. ఐసిసిఆర్ అందించే సేవలు మీ దేశాలలో విద్యార్థులకు వివరించి మరింత మందికి ఉపయోగంగా నిలవాలని సూచించారు. ఐసిసిఆర్ నిర్వహించే కార్యక్రమాలను వివరిస్తూ.. వీటిలో ప్రధానమైనది విదేశీ విద్యార్థులకు విద్యకు అవసరమైన స్కాలర్‌షిప్‌ను అందించడమేనని పేర్కొన్నారు. ఒక ప్రత్యేకమైన వైవిధ్యత కలిగిన కార్యక్రమంగా స్కాలర్‌షిప్ ప్రోగ్రాం నిలుస్తుందని తెలిపారు.

ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 59 దేశాల నుంచి 1100 మందికిపైగా విదేశీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకోవడం పట్ల విదేశీ విద్యార్థులను అభినందించారు. ఏయూలో నాణ్యమైన విద్యను వీరికి అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసిసిఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం అసోసియేట్ డీన్ ఆచార్య ఎన్ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎయుతో తమకున్న అనుబంధాన్ని, విశాఖ నగరం, తెలుగు ప్రజల ప్రేమాభిమానాలను గుర్తు చేసుకుంటూ వేదికపై తమ అనుభూతులను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆలుమ్ని కార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో భాగంగా విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎంవిఆర్.రాజు, జి.గిరిజ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

1న బహిరంగ వేలం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 3వ జోన్ (ఆశీలు మెట్ట) పరిధిలోని పలు దుకాణాలకు జులై 1వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ శనివారం తెలిపారు. 3వ జోన్ పరిధి హెచ్‌బి.కాలనీలో వారాంతపు సంత, ఖాళీగా ఉన్న పలు దుకాణాలకు మంగళవారం జోన్-3 ఆశీలుమెట్టలోని కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడునని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు 3వ జోనల్ కమిషనర్ కార్యాలయం పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

ఒప్పంద కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి తాగు నీటి సరఫరా విభాగంలో ఒప్పంద కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పంద కార్మికుల సమ్మెతో రెండ్రోజులుగా తాగు నీరు సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే జివిఎంసి అధికారులు స్పందించి వారి డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

30న సన్యాసిరావు మాస్టారు ఉద్యోగ విరమణ



ప్రజాశక్తి -పద్మనాభం : ముదరగడ్డ సన్యాసిరావు మాస్టారు ఈనెల 30వ తేదీ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 29న పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు విరమణ సన్మాన సభను ఘనంగా నిర్వహిస్తున్నారు.

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన వెంకటస్వామి, ఆదిలక్ష్మి దంపతులకు మూడవ సంతానంగా సన్యాసిరావు మాస్టారు 1963 జూన్ 15న జన్మించారు. సన్యాసిరావుకు ఇద్దరు అక్కలు, ఒక చెల్లి ఉన్నారు. సన్యాసిరావు రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 1969 నుండి 1974 వరకు ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. 1974 నుండి 1979 వరకు అదే గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి వరకు పూర్తి చేశారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1979 నుండి 1982 ఇంటర్ విద్యను పూర్తి చేశారు.1982 -83లో భీమిలి డైట్‌లో టిటిసి పూర్తి చేశారు. 1984 మార్చి 26వ తేదీన పద్మనాభం మండలం మద్ది ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. అదే సంవత్సరం జూలై 7వ తేదీ వరకు అక్కడ పనిచేసిన తర్వాత స్వగ్రామమైన రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. 1994 జూన్ 12వ తేదీ వరకు అక్కడ పనిచేశారు. 1994 నుండి 1995 వరకు పక్కనే ఉన్న పొట్నూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. 1995 మే నుంచి 2001 వరకు ఆనందపురం మండలం గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో నాన్ ప్యానెల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. అక్కడి నుంచి అదే మండలం బోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రమోషన్‌పై గణిత ఉపాధ్యాయునిగా వెళ్లారు. 2001 నుండి 2009 వరకు అక్కడ పనిచేశారు. 2009 జూలై 28 నుండి అక్టోబర్ వరకు పద్మనాభ జిల్లా పరిషత్ హైస్కూల్లో పనిచేశారు. 2009 అక్టోబర్ 10వ తేదీన ప్రధానోపాధ్యాయునిగా ప్రమోషన్‌పై రోలుగుంట మండలం బుచ్చమ్మపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2015 నవంబర్ 3వ తేదీ వరకు పనిచేశారు. 2015 నవంబర్ 4 నుండి 2023 వరకు పద్మనాభం మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో పనిచేశారు. 2023 నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు స్వగ్రామమైన రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఇదే పాఠశాలలో చదువుకొని ఇదే పాఠశాలలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందడం గర్వకారణంగా ఉందని సన్యాసిరావు మాస్టారు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

అక్షర జ్యోతి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గొట్టిపల్లి స్కూలును హైస్కూల్‌గా అప్‌డేట్ చేయడం, విద్యార్థులకు ఎన్ఎంఎస్ సీట్లు రావడంలో కృషి చేయడం, ఆయన పని చేసిన అన్ని స్కూళ్లలోనూ శతశాతం ఫలితాలు సాధించడం ఆయన సేవలకు నిదర్శనంగా నిలిచాయి.

అవార్డులు

గొట్టిపల్లి పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంలో సన్యాసిరావు మాస్టారు కృషిని గుర్తించి ఆనందపురం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2005లో లభించింది. 2006లో పద్మనాభం మండలంలో పనిచేసినప్పుడు మండల స్థాయి ఉత్తమ అవార్డును సాధించారు. మద్ది గ్రామంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసినప్పుడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు.

విద్యుత్ నిలుపుదలతో తాగునీటి ఇబ్బందులు

- ◆ పశువులకూ నీటి కొరతే..
- ◆ పట్టించుకోని విద్యుత్‌శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడలో తరచూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తుండడంతో గ్రామ ప్రజలకు తాగునీరు అందించే మోటార్లు పని చేయక తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆకాశం ఏ మాత్రం మేఘాలు వేసినా, చిన్నపాటి వర్షపు జల్లులు పడినా చౌడువాడలో విద్యుత్తు ఉండడం లేదు. ఇక్కడ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్మెన్‌తో పాటు కొంతమంది ప్రైవేట్ సిబ్బంది కూడా పని చేస్తున్నారు. ఎంతమంది ఉన్నప్పటికీ విద్యుత్తు అంతరాయం కలిగినప్పుడు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల ఒత్తిడి చేస్తే ఏదో విధంగా గ్రామానికి విద్యుత్తు సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప గ్రామానికి తాగునీటిని అందించే పంపు హౌస్‌లు ఉన్న ప్రాంతానికి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

గ్రామంలో ఎక్కువగా ప్రభుత్వ ఏర్పాటు చేసిన చేతిబోర్లుతో పాటు వ్యక్తిగత బోర్లు కూడా ఇళ్లల్లో ఉన్నాయి. అయినప్పటికీ ఆ నీరు ఇంటి అవసరాలకు తప్ప తాగడానికి ఏమాత్రమూ బాగోదు. దీంతో అధికారులు, గ్రామ పెద్దలు తాగునీటి కోసం గ్రామానికి దూరంగా శారదా నదిలోనూ, రాజ అప్పారావు పొలం వద్ద బోర్లు, పంపుహౌస్ ఏర్పాటు చేసి గ్రామానికి కావలసిన తాగునీటిని అందిస్తున్నారు. అక్కడ నీరు సమృద్ధిగా ఉన్నప్పుడికీ తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఇక్కడి విద్యుత్ సిబ్బంది గ్రామంలో ఉన్న పెద్ద పైడిమాంబ ఆలయం వద్ద ఉన్న ఏబీ స్విచ్‌ను ఆఫ్ చేసి గ్రామానికి విద్యుత్ సరఫరా ఉంచి, పొలాల్లోకి వెళ్లే లైన్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. దీంతో పంపు హౌస్‌లకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో గ్రామానికి తాగునీటి సరఫరా చేసే మోటార్లు పని చేయక గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడుతుంది. ఈ విధంగా ప్రతినిత్యం జరుగుతుంది. మహిళలు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో ఉన్న వీధి కుళాయిల వద్ద పడికాపులు కాస్తున్నారు. నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.



నీటి కోసం కుళాయి వద్ద నిరీక్షిస్తున్న చౌడువాడ గ్రామస్తులు

పశువులకు కూడా తాగునీటి ఇబ్బందులు

రెండు పంపు హౌస్‌లు ఉన్న ప్రాంతంలోనే చౌడువాడ గ్రామానికి చెందిన రైతుల పొలాలు, పశువుల పాకలు కూడా ఉన్నాయి. ప్రతి రైతుకు మూడు నుంచి నాలుగు, ఐదు వరకు పశువులు ఉన్నాయి. పశువులకు రైతులు విద్యుత్ మోటార్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. విద్యుత్ అంతరాయంతో పశువులకు కావలసిన తాగునీరు కూడా అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకోని విద్యుత్‌శాఖ సిబ్బంది

విద్యుత్తు అంతరాయంపై గ్రామంలో ఉన్న విద్యుత్ సిబ్బందికి రైతులు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేసినా వారు ఏమాత్రం సమాధానం చెప్పడం లేదని రైతులు అంటున్నారు. రైతులకు మరీ ఇబ్బంది అయితే మండల కేంద్రంలో ఉన్న ఎలక్ట్రికల్ ఏఈ ద్వారా సమాధానం పొందుతున్నారు. ఎవరైనా రైతులు ఇక్కడి సిబ్బందిని కలిసి అడిగితే విద్యుత్ వైర్లకు చెట్లు కొమ్మలు తగులుతున్నాయి అందువలన లైను నిలబడలేదని సమాధానం చెబుతున్నారు తప్ప వారు మాత్రం లైన్ వెంటవెళ్లి ఎక్కడ ఇబ్బంది ఏర్పడుతుందో పరిశీలించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది స్పందించి పంపు హౌస్‌కు, పొలాలకు విద్యుత్ సరఫరా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.నర్సింగరావు

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్మించిన కమ్యూనిటీ కిచెన్‌ను విజ్ఞాన కేంద్రం చైర్మన్ సిహెచ్.నర్సింగరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ కిచెన్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగే విద్యా, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, మేధో, పరిశోధనా కార్యక్రమాలకు ఎంతో తోడ్పాటునిస్తుందని అన్నారు. ఈ కేంద్రం నిరంతరం బాలోత్సవాలు, బాలల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కంప్యూటర్ స్కిల్ డెవలప్‌మెంట్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లు, పోటీ పరీక్షలకు శిక్షణ, మెడికల్ క్యాంపులు వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనతి కాలంలోనే విశాఖ నగరంలో ఎంతో పేరు గడించిందని అన్నారు. తాజాగా విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం ఎంతో మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కిచెన్‌కు కుక్కర్లు, వంట స్టవ్‌లు, పాత్రలు ఇచ్చిన రామారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సెక్రటరీ డాక్టర్ బి.గంగారావు, ట్రస్టీ ఎం.జగ్గునాయుడు, ట్రస్ట్ నిర్వాహకులు ఎంఆర్‌డి.రాజు, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వాహకులు జిఎస్.రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, బుజ్జి, కామేశ్వరరావు, కొండప్ప పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైనదని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడిఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్‌ఎఆర్‌ఎస్‌లో శనివారం నిర్వహించిన శిక్షణ సందర్శన కార్యక్రమానికి డాక్టర్ సిహెచ్ ముకుందరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మే, జూన్ మాసాల సాధారణ వర్షపాతం 231 మిల్లీమీటర్లకుగాను ఇప్పటి వరకు 272 మిల్లీమీటర్ల వర్షపాతం అంటే 18 శాతం అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. వ్యవసాయ శాఖ డిఏఓ ప్రతినిధి సిహెచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులకు అవసరమైన వరి, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, సజ్జ విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ పివికె.జగన్నాధరావు, డాక్టర్ ఎం విశాలాక్షి, డాక్టర్ బి.భవాని, డాక్టర్ ఆర్.సరిత, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడిఏలు, ఉద్యాన శాఖ ఏడిఏలు, హెచ్‌ఓలు పాల్గొన్నారు.

భారీ వినాయక విగ్రహం ఏర్పాటుకు అంకురార్పణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో సద్భావన టీం ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా 66 అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటుకు స్థానిక హార్డింగ్ గెస్ట్ హౌస్ ఖాళీ స్థలంలో నిర్వాహకులు శనివారం అంకురార్పణ రాటా వేశారు. వచ్చే వినాయక చవితికి ఈ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం కలకత్తా నుండి కళాకారులను రప్పించారు. సుమారు రూ.25 లక్షలతో విగ్రహ ఏర్పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, జి.వెంకట సత్యనారాయణ, స్వయంభు విగ్నేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ, సబ్ రిజిస్ట్రార్ గీతా లక్ష్మి, సద్భావన టీం నిర్వాహకుడు కొప్పాక రాజేష్, కనిశెట్టి సన్యాసిరావు, గూనూరు సురేష్, చేకూరి రాజు, దేవరపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు కొన అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కుళాయిలను పరిశీలిస్తున్న డిపిఒ సందీప్

పారిశుధ్యం లోపిస్తే అంటురోగాలు : డిపిఒ

ప్రజాశక్తి-చోడవరం : పారిశుధ్యం లోపిస్తే అంటు రోగాలు ప్రబలుతాయని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ అన్నారు. మండలంలోని వెంకన్నపాలెం, గంధవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో దోమలు అధికంగా ఉంటాయని, వీటిని నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. క్లోరినేషన్ జరిగిన ప్రతిసారీ రుజువులతో సహ నివేదికలు పొందుపరచాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని, డ్రైనేజీలు పక్కన ఉన్న వీధి కుళాయిల వద్ద ఎల్లప్పుడూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు వీధులను శుభ్రం చేయడం, బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని కోరారు. జ్వరాలు అంటురోగాలు వచ్చే అవకాశం ఉన్నచోట ముందుగానే అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజనేయులు, మండల ప్రత్యేక అధికారి కె శ్రీదేవి, పిఏఆర్‌డి మహేష్, మండల ఇంజనీరు శాంతారామ్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా పీజీ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పోస్ట్ గ్రాడ్యుయేట్ గ్రాడ్యుయేషన్ దినోత్సవం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్ ప్రసంగించారు. నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన సమగ్రత, సామాజిక బాధ్యత ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ వినూత్న నాయకులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ సవాళ్లతో కూడిన సమయాల్లో వారి అంకితభావం కృషికి విద్యార్థులను అభినందించారు. అనంతరం డాక్టర్ అనిల్ కుమార్‌ను దుస్సాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఎంబిఏ, ఎంటెక్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఆయా విభాగాల గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జులై 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని 51వ వార్డులో మున్సిపల్ కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిని 12 గంటలకు పెంచొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, జోన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ యూనియన్ సిఐటియు నాయకులు పాపారావు, దేవి, లక్ష్మి, దాలయ్య, సంతోష్, రాంబాబు, సాధురావ్, సన్యాసిరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

కె.కోటపాడు : జులై 9న అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటున్నారని సిఐటియు మండల కార్యదర్శి ఈ నాయుడు బాబు తెలిపారు. ఈ మేరకు ఎంఈఓకు శనివారం మిడ్డేమీల్స్ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ 45వ కార్మిక సదస్సు నిర్ణయం ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులందరిని గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మెను ఛార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20కు పెంచి ఇవ్వాలి, జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా సంఘాలు కన్వీనర్ ఎర్ర దేముడు, మిడ్డేమీల్స్ కార్మికులు మొల్లి ఎరికమ్మ, పి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, జిఎస్.సంతోష్, పైల అమ్మాజీ, సూరిశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు సమ్మె నోటీసు ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

కళాశాలకు టాయిలెట్ అప్పగింత

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం వారు నిర్మించిన టాయిలెట్‌ను కాలేజీ నిర్వాహకులకు శనివారం అప్పగించారు. మరుగుదొడ్ల సమస్యతో బాలికలు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని రూ.2.30 లక్షల ఖర్చుతో దీనిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐవివి సత్యవతి, గౌరీ శంకర్ మాస్టారు, గుప్తా, న్యాయవాది బాబీ, జుత్తాడ పాఠశాల హెచ్‌ఎం వాడ్రేవు శేషగిరి కృష్ణాజీ, వివిఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఫలసాయం మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ఫారం పాండ్స్, నీటికుంటలు తవించుకున్న రైతులకు కొబ్బరి, మామిడి, వేప, బాదం, సపోట తదితర ఫలసాయం మొక్కలు సరఫరా చేస్తామని ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఏపీఓ వరహాలుబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు 50 సెంట్లు నుంచి 5 ఎకరాల భూమి వరకు చిన్న సన్నకారు రైతులు ఉపాధి హామీ ద్వారా మొక్కలు పెంచుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మామిడి, జీడిమామిడి, నిమ్మ, సపోటా, కొబ్బరి, జామ వంటి రకాల మొక్కలు మూడేళ్ల సంరక్షణ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులు, అధికారులపై రాజకీయ ఒత్తిడి తగదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉద్యోగులు, అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ట్రాన్స్‌ఫర్లు, స్కూలు, హాస్టల్ సీట్లు కోసం ఒత్తిడి చేస్తూ వారిని మానసిక వేదనకు గురి చేయడం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీలో 6వ తరగతి సీటు కోసం స్థానిక ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను బెదిరింపులకు, తీవ్ర ఒత్తిళ్లకు గురి చేయడం సరికాదన్నారు. స్కూల్ సీటు విషయమై ప్రిన్సిపాల్‌ను పార్టీ కార్యాలయానికి పిలిపించుకొని తీవ్ర ఒత్తిడి చేయడం, దుర్భాషలాడడం మీరు డ్యూటీ ఎలా చేస్తారో చూస్తామని బెదిరింపులకు పాల్పడడంతో కేజీబీవీ ప్రిన్సిపాల్ మానసిక ఒత్తిడి తట్టుకోలేక మూర్ఛ వచ్చి పడిపోయారని తెలిపారు. న్యాయబద్ధంగా జరగాల్సిన ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవడం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని, అనేకమంది ఉద్యోగులు ప్రజాప్రతినిధుల ఒత్తిడి తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవులు పెడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు పనుల్లో జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. చోడవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకుల బెదిరింపులతో ఆసుపత్రి పాలైన కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని శంకర్రావు డిమాండ్ చేశారు.

కెజిబివి ప్రిన్సిపల్‌పై మానసిక వేధింపులు సరికావు

అనకాపల్లి : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణపై స్థానిక ఎమ్మెల్యే, టిడిపి నాయకులు మానసిక వేధింపులు చేయడాన్ని ఏపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, అనకాపల్లి జిల్లా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జేఏసీ కన్వీనర్ వివి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీల పేరుతో కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు కేజీబీవీ మహిళా సిబ్బంది పట్ల అమర్యాదగా మాట్లాడుతూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇది ఉద్యోగుల గౌరవానికి, భద్రతకు విఘాతమన్నారు. ప్రస్తుతం కేజీబీవీలలో విద్యార్థుల సీట్లు ఆన్లైన్ విధానంలో భర్తీ అవుతున్నా, వాటిపై అవగాహన లేకుండా ప్రిన్సిపాల్స్‌పై ఒత్తిళ్లు, వేధింపులు చేయడం సరికాదని పేర్కొన్నారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయం చేయాలని కోరారు. వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళా ఉద్యోగుల భద్రత కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు.


వైద్యాధికారిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

వైద్యాధికారులను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా విధులు చేపట్టిన వైద్యాధికారులు రమేష్‌బాబు, శకుంతలను తెలుగు రైతు నియోజకవర్గం ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు ఆధ్వర్యాన శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యాధికారులను సాలువతో సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గోరవెల్లి చినరామ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రజా సమస్యల పరిష్కారం పట్ల టిడిపి మండల కమిటీ సభ్యులు దృష్టి సారించాలని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలో శనివారం టిడిపి మండల నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల కార్యవర్గాన్ని నియమించారు. పార్టీ మండల అధ్యక్షునిగా పీలా తులసీరాము, ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల అప్పారావు, ఉపాధ్యక్షులుగా దేశంశెట్టి వెంకటరమణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పుర్రె శ్రీనివాసరావు, అడిగర్ల ప్రసాద్, ధర్మరెడ్డి రామకృష్ణ, కార్యదర్శులుగా మల్ల చిన్నబాబు, బండి సూరిబాబు, సింగంపల్లి అప్పారావు, కోశాధికారిగా మచ్చు గంగరాజు, అలాగే క్లస్టర్ 8 కన్వీనర్‌గా మామిడి శివ అప్పారావు, క్లస్టర్ 9 కన్వీనర్‌గా రాజాన అప్పలనాయుడు, క్లస్టర్ 10 కన్వీనర్‌గా యాండ్ర అప్పలనాయుడు, కో-కన్వీనర్‌గా కొవిరి బంగారయ్య నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, కర్రి ఆదిబాబు, లాలం రాము, గుడివాడ జయకుమార్, పతివాడ చిన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సబ్బవరం సిఐ జి.రామచంద్రరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు సిఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ధరించాలని, సెల్ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కె.శ్రీనివాసవర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన నేత పరశురాం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక : జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం జన్మదిన వేడుకలు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జనసేన ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి పరశురాంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ఎవి సత్యనారాయణ, కాళ్ళ చంద్రమోహన్, ఎల్లపు వెంకట భాస్కరరావు, బొడ్డేడ అప్పలనాయుడు, మొల్లేటి ఆనంద్, సూరిశెట్టి అప్పలనాయుడు, చొప్ప శ్రీను, కె.కాశి, పల్లి నర్సింగరావు, ఆళ్ల వెంకటేశ్వరరావు, దొడ్డి భాస్కర్, కాండ్రేగుల గాంధీ, గవిరెడ్డి సూర్యనారాయణ, కర్రి కేశవ, అల్లవరపు రమణబాబు, ఎలక రవి, గుబ్బల సత్యనారాయణ, కొయిలాడ గంగాధర్, సుందరపు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా, పట్టణ పరిసర రహదారుల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలకు చర్యలు చేపట్టి, ప్రజలకు భద్రత, రక్షణ కల్పించాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం కొత్తూరు రహదారి బ్రిడ్జి వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, సరైన నియంత్రణ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రీకాలింగ్ బాబు మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన


మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

ప్రజాశక్తి-అనకాపల్లి

రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పేరుతో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను జూలై 1 నుంచి 7వ తేదీ వరకు ప్రజల్లో తీసుకువెళ్తామని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వెల్లడించారు. స్థానిక రింగ్ రోడ్డు పెంటకోట కన్వెన్షన్‌లో శనివారం వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ చంద్రబాబుకు వాగ్దానాలు చేయడం తప్ప వాటిని అమలు పర్చడం తెలియదన్నారు. గ్రామ గ్రామాన చంద్రబాబు మోసపూరిత, దొంగ హామీలపై ప్రజలకు తెలియజేస్తామన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ అరెస్టులతో వైసిపి నాయకులను భయపట్టలేరని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో బాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈ సందర్భంగా రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, అనకాపల్లి పార్లమెంటు పరిశీలకురాలు శోభ హైమావతి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, అదీప్ రాజు, పెట్ల ఉమా శంకర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం పంచాయతీలో పరిధిలో సంపద తయారీ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఇంటింటికి వెళ్లి సేకరించి దాని నుండి వర్మీ కంపోస్టు తయారు చేసుకుని దానిని సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని సూచించారు. పంచాయతీల కార్యదర్శులు డ్రైనేజీ క్లీనింగ్, క్లోరినేషన్‌లపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఈఓపిఆర్డీ చైతన్య, సర్పంచ్ మోపాడ అప్పారావు, వంగలపూడి సంతోష్ బాబు, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ వివి.రవికుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రతగా ఉంచాలని, తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి రైతులకు ఎరువు తయారు చేసి పంచాయితీకి ఆదాయం సమకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాబురావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ దారిలో కల్వర్టు నిర్మించరూ...

ప్రజాశక్తి-కె.కోటపాడు : తమ హాస్టల్‌కు వెళ్లేదారిలో ఉన్న కాలువపై కల్వర్టు నిర్మించాలని కె.కోటపాడు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు తమ గోడును మీడియా ముందు వినిపించుకున్నారు. కె.కోటపాడు, జంగాల కాలనీ దగ్గర ఉన్న బీసీ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌కు సరైన మార్గం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాలువ నిర్మించారు కానీ దానిపై కల్వర్టు నిర్మించకపోవటం వలన నడవడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు కాలుపై తాత్కాలికంగా చిన్న చెక్క వేసుకుని హాస్టల్‌కు వెళుతున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు కాలు నిండా నీరు ప్రవహించడం వలన హాస్టల్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది వర్షాకాలం కావడం వల్ల చాలా భయంగా ఉందని, కాలువలో పడితే చాలా ప్రమాదమని ఆందోళన చెందుతున్నారు. హాస్టల్ విద్యార్థులకే కాకుండా అదే మార్గం ద్వారా వెళుతున్న కొంతమంది నివాసితులు, రైతులు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పశువులకు ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని రైతులు అంటున్నారు. వెంటనే కాలువపై కల్వర్టు నిర్మించాలని స్థానికులు, హాస్టల్ విద్యార్థులు అధికారులను కోరుతున్నారు.


కాలువపై చెక్క వేస్తున్న విద్యార్థులు

టిడిపి భీమిలి పరిశీలకునిగా సాయికృష్ణ


ఎమ్మెల్యే గంటాను కలిసిన సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : తెలుగుదేశం పార్టీ భీమిలి నియోజకవర్గ పరిశీలకునిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శనివారం సాయికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయికృష్ణకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

పాడేరు పరిశీలకులుగా నాగ జగదీష్

అనకాపల్లి రూరల్ : టిడిపి పాడేరు నియోజకవర్గం పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు నియమితులయ్యారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి పాడేరులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగ జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగజగదీష్‌ను శాలువాతో సత్కరించి మోదకొండమ్మ చిత్రపటాన్ని బహూకరించారు.

డిటిగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మునగపాక : మండల డిప్యూటీ తహసీల్దారుగా ఆర్‌వి మురళీధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బుచ్చయ్యపేట మండలంలో విధులు నిర్వహించిన మురళీధర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దారుగా పని చేసిన శేష్ కుమార్ చోడవరం బదిలీపై వెళ్లారు.

30న జర్నలిస్టు ఆహ్వాన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : రియా ఫౌండేష 5వ వార్షికోత్సవం సందర్భంగా రియా ఫౌండేషన్, పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరవాడలో ఈ నెల 30న జర్నలిస్ట్ ఆహ్వాన క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రియా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎమ్.డి.రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం పని ఒత్తిళ్లతో సతమతమవుతున్న విలేకర్లకు ఆటవిడుపుగా ఉంటుందని, జర్నలిస్టులలో క్రీడా స్ఫూర్తి నింపడం కోసం ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫార్మాసిటీ క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో జర్నలిస్ట్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



స్కూల్లో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్లో విద్యార్థుల చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో దేవవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేరికలపై ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని ఎంఈఓ కే నరేష్ అన్నారు. పాఠశాలల్లో పిల్లల ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేయడం జరిగిందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య బోధన, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మధ్యాహ్నం భోజనం వంటి వాటిపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 39 మంది విద్యార్థులు తమ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులకు ఎంఈఓ నరేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్.ఎమ్ వేమగిరి సూకరాజు, ఉపాధ్యాయులు పి వెంకటరావు, డి.ఆర్ కే శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు భూసేకరణకు..

సర్వే చేస్తే అడ్డుకుంటాం : సిపిఎం



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, సర్పంచ్ రామకృష్ణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో డిఎల్ పురంలో వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం అదనంగా భూసేకరణ చేపట్టొద్దని, భూములు సర్వే చేస్తే అడ్డుకుంటామని గ్రామ సర్పంచ్ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. డిఎల్ పురంలో స్థానిక రైతులతో కలిసి శనివారం వారు మాట్లాడారు. మండలంలో వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ఇప్పటికే ఏపీఐఐసీ సేకరించిన భూములను పూర్తిగా వినియోగమునకు తీసుకురాకుండానే మరలా ఇప్పుడు వేంపాడు, నెల్లిపూడి, డిఎల్ పురం గ్రామాల్లో అదనపు భూమి సేకరించాలని అధికార యంత్రాంగం భూములు సర్వే చేపట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు నెలకొల్పడం ఒక్కటే కాదని, వ్యవసాయ రంగాన్ని కూడా అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ ప్రాంతం జిల్లాలోనే హార్టీకల్చర్ డిపార్ట్మెంట్ లెక్కల ప్రకారం కొబ్బరి, జీడి మామిడి, మామిడి తోటలు పెంపకంలో నక్కపల్లి మండలం మొదటి స్థానంలో ఉందని, అంతేకాకుండా మినీ కోనసీమగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి రైతుల దగ్గర భూములు తీసుకొని వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించడం దుర్మార్గమన్నారు. మండలంలో 8 గ్రామాల్లో మత్స్యకారులు సముద్రం పై ఆధారపడి చేపల వేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, తీరంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వాటి నుంచి వచ్చే వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదిలి మత్స్యవేట లేకుండా చేయడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుందని విమర్శించారు.ప్రభుత్వం ఒకపక్క రైతులు, మరోపక్క మత్స్యకారుల పై యుద్ధం ప్రకటించినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్కు క్యాప్టివ్ పోర్టుకు అనుమతి ఇచ్చి డిఎల్ పురం నుండి తూర్పు పడమర వైపు 3 కిలోమీటర్లు సముద్ర తీరాన్ని ఆర్సెలార్ పోర్టుకు అప్పగించి పోర్ట్ నెలకొల్పితే, ఈ మండలంలో మత్స్యకారులు వేట కోల్పోయి, మత్స్యకారులు పూర్తిగా మనుగడ కోల్పోతారన్నారు. పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ రకంగా వేల ఎకరాలు పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సూర్యారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి, సర్పంచ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -కోటవురట్ల:పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మాకవరపాలెం మండల ప్రత్యేక అధికారి మోహనరావు తెలిపారు. శనివారం ఎంపీడీవో చాయ సుధాతో కలిసి శెట్టిపాలెం పాఠశాలను సందర్శించి సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని నాణ్యమైన భోజనం అందించాలన్నారు, అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలో శనివారం వేంపాడు, దేవవరం గ్రామాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ పై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయించాలని, తప్పనిసరిగా క్లోరోనేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. దోమలు నివారించేందుకు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓపిఆర్డి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నర్సీపట్నంలో మందును వేస్తున్న పశువైద్యాధికారి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :బలిఘట్టం, వేములపూడిలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు శనివారం అందజేశారు. పశువైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ, జూలై 10వ తేదీ వరకు నర్సీపట్నం మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడం జరుగుతుందన్నారు. 550 గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములపూడి ఎం.పి.టి.సి సభ్యులు బోలెం రామ్ ప్రసాద్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ:గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్నట్లు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పశువైద్యాధికారిణి శిరీషా అన్నారు. శనివారం ఏఎల్పురం, కొంగసింగి, పాతకృష్ణదేవిపేట తదితర గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సుమారు 300 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ పాడి రైతులు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న గొర్రెలు, మేకలకు ఈ మందును వేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : గొర్రెలు, మేకలు తదితర జీవాలకు నట్టలు నివారణ మందు తాగించడం జరుగుతుందని నరసింగబిల్లి పశు వైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ తెలిపారు మండలంలోని నరసాపురం, అమీనా సాహెబ్ పేట గ్రామంలో శనివారం నట్టలు మందు తాగించే కార్యక్రమం చేపట్టారు. 235 గొర్రెలకు, 430 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందును తాగించారు ఈ కార్యక్రమంలో మందపల్లి శివ, కే వెంకటేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -రోలుగుంట:రోలుగుంట మండల కోఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో శనివారం విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయాధికారి చిరంజీవి రైతులకు పలు సూచనలు చేశారు. ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అందిస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు చంద్ర, గుమ్ములూరు చంద్రమౌళి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో రైతులకు శనివారం వరి విత్తనాలు పంపిణీ చేశారు.



బుచ్చయ్యపేటలో పంపిణీ చేస్తున్న నాయకులు

ఆర్జెఎల్, సోనామసూరి తదితర రకాల విత్తనాలు అందించారు. సోనామసూరి, సాంబామసూరి, స్వర్ణ, ఇంద్ర రకాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరిసా నాని, ఎంపీటీసీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

30 నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి -రావికమతం:ఈనెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సర్పంచులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ శిక్షణా తరగతులకు మండలంలోని మహిళా సర్పంచులందరూ హాజరు కావాలని ఆయన తెలిపారు. సర్పంచుల విధులు, బాధ్యతలతో పాటు గ్రామ పరిపాలన విధానంలో తగు సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్తో హాజరు కావాలని ఆయన కోరారు.



వైద్య పరీక్షలు వైద్యులు సోముదొర

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో అవురువాడ పంచాయతీ శివారు సీతబంధల గ్రామంలో కింతలి పీహెచ్సీ వైద్యులు సోమ దొర ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు షుగర్, మలేరియా, డెంగ్యూ పరీక్షలతో పాటు రక్తహీనత పరీక్షలు కూడా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. వైద్యాధికారి సోముదొర పర్యవేక్షణలో సీత బంధల, అవురువాడ, ఇరువాడ, తుమ్మవానిపాలెం గ్రామాలలో మలేరియా వ్యాధి ప్రబలకుండా దోమల మందును పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వసంత, ఎంఎల్హెచ్పి అశ్విని, యమునా, ఏఎన్ఎం భాను, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యాధికారులు బాధ్యతల స్వీకరణ



సోముదొర



తలారి శ్రీను

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో కింతలి ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఇప్పటి వరకు విధులు నిర్వహించిన కె.మాలంనాయుడు బదిలీపై కే కోటపాడు మండలం చౌడువాడ వెళ్లగా, జి మాడుగుల మండలం గెమ్మెలి నుండి "సోముదొర బాధ్యతలు స్వీకరించారు. అలాగే పాడేరు మండలం ఈదులపాలెం నుండి "తలారి శ్రీను బాధ్యతలు చేపట్టారు. శనివారం వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



హాజరైన అధికారులు

పాయకరావుపేటలో ప్రజా వేదిక

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జాతీయ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. మండలంలోని ఇరవై నాలుగు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం సంబంధించిన పనులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సామాజిక తనిఖీ వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎస్‌డిటిగా భాస్కర్‌రావు

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం పౌరసరఫరాల సిఎస్‌డిగా జి.భాస్కర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కసింకోట మండలం డీ.టీగా పని చేసి బదిలీపై రావికమతం సిఎస్‌డిటిగా విధుల్లో చేరారు. ఇప్పటివరకు రావికమతం మండల సిఎస్‌డిటిగా పనిచేసిన ఈశ్వర రావు రోలుగుంట మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ,చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం మండలాలకు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ లోపు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు, బెడ్ రెస్ట్ పై ఉన్నవారి ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలని తెలిపారు.





రికార్డులు పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోటపాడు అంగన్వాడి కేంద్రాన్ని శనివారం ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి తనిఖీ చేశారు. ఎంతమంది చిన్నారులు కేంద్రంలో చేరారు, 5 సంవత్సరాలు దాటిన విద్యార్థులు బయట స్కూల్ కి వెళ్లారని ఆరా తీశారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవో మంగతాయారు, సూపర్వైజర్లు చిన్నమ్మలు, ఈశ్వరమ్మ అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ 2041పై సూచనలకు గడువు పెంపు

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: రాష్ట్రప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జనవరి 16, 2025నాటి వియంఆర్డిఎ మాస్టర్ ప్లాన్ 2041 పున్ణసమీక్షించేం దుకు ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకునేందుకు మరొక 27 రోజులు 2025 జూలై 17 వరకూ గడువు పొడిగిస్తున్నట్లు వియంఆర్డిఎ చైర్మన్ ఎం.వి. ప్రణవగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు మాస్టర్ ప్లాన్ పై అభ్యంతరాలు తెలియజేయాలనుకునేవారు రాత పూర్వకంగా vmrda.ap.gov.in/objections లో తపాలా ద్వారా గాని స్వయంగా గాని మెట్రోపాలిటన్ కమిషనర్ వియంఆర్డిఎ విశాఖపట్నంకి అందజేయాలని సూచించారు. ఎలమంచిలి, అనకాపల్లి, పాయకరావుపేట, తదితర ప్రాంతాల వారి సౌలభ్యం కోసం అనకాపల్లి ఆర్డిఒ కార్యాలయంలో జూన్30, జూలై 1వ తేదీల్లో ఎస్.కోట, చీపురుపల్లి, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల ప్రాంతాల వారి సౌలభ్యం కోసం విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జూలై 14 ,15 తేదీల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

మున్సిపాల్టీకి రూ.1.11కోట్ల నిధులు విడుదల

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మున్సిపల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీకి విఎంఆర్డిఎ నిధులు రూ.1.11 కోట్లు నిధులు తీసుకు వచ్చినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నర్సీపట్నంలో కోటి రూపాయల విలువైన పారిశుధ్య వాహనాలను, పనిముట్లను శనివారం ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను రాజకీయంగా ఎంతో ఉన్నత స్థాయిలో ప్రజలు కూర్చోబెట్టారని ఆయన అన్నారు.15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 కోట్లు తీసుకు వచ్చినట్లు చెప్పారు. జనరల్ గ్రాంట్ నుంచి కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. మరో రూ.14.19 కోట్లు విఎంఆర్ నిధులు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గతంలో తాను ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నర్సీపట్నం ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.142 కోట్లతో వేయించిన మంచినీటి పథకాన్ని గత ప్రభుత్వంలో నిర్వీర్యం అయిందని తాజాగా ప్రతిపాదనలు తయారు చేయించి. పథకాన్ని పున రుద్ధరింపజేశానన్నారు. వచ్చే రెండేళ్లలో ఈ సథకాన్ని పూర్తి చేస్తామని చెప్పారు 700 కొత్త వీధి లైట్లు వేయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నర్సీపట్నం మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి, ప్రస్తుతం పారిశుద్యం పై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. ఇందుకోసం ఒకేసారి టన్నుల చెత్తను తరలించే కాంపాక్టర్ మిషన్ కొనుగోలు చేశామన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.30లక్షలతో కొత్తగా వాహనాలు కొనుగోలు చేశామన్నారు.

మండల లెవెల్ కో ఆర్డినేషన్ సమావేశంలో భూ సమస్య పరిష్కారం



ఇరు వర్గాలతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-మాడుగుల:భూ వివాదాలు, సమస్యలు పరిష్కరించే విధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల లెవిల్ కో ఆర్డినేషన్ సమావేశంలో ఓ భూ సమస్యని పరిష్కరించారు. వివిద ప్రాంతాల్లో పరిష్కారం కాని భూ సమస్యలను మాడుగుల రెవిన్యూ కార్యాల యంలో పరిష్కరించేందుకు గాను ప్రతీ శనివారం సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన పిర్యాదులను తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, ఎస్ఐ సమక్షంలో పరిష్కరించారు. భూ వివాదాలకు సంబందించి మూడు పిర్యాధులు వచ్చాయి. దీంతో ఇరు పార్టీలవారిని కూర్చోబెట్టి సమస్య పరిష్కరించే ప్రయత్నం చెయ్యడం తో మూడింటిలో ఓ సమస్య పరిష్కరించగా మిగిలిన రెండు పిర్యాదుదారుల సమస్య కొలిక్కి రాకపోవడంతో కోర్టుకి వెళ్లమని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కెఎ.నాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల గాంధీ పార్క్ ప్రాంగణంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పడాల కొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశాభివృద్ధిలో పీవీ సేవలను కొనియాడారు.విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లా అప్పారావు, యేసు రాజు, పుట్ట అమరయ్య శెట్టి గుప్తా తదితరులు పాల్గొన్నారు.



నివాళులలు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు